క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీహోమం


లక్ష్మీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలో జువ్వలపాలెం రోడ్డులోని శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం ఉత్తర నక్షత్రం పురస్కరించుకుని శ్రీపద్మావతి అమ్మవారికి ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా లక్ష్మీహోమం, సహస్ర దీపోత్సవం నిర్వహించారు. అలాగే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ మంతెన రామ్‌కుమార్‌రాజు, ఆలయ కార్యనిర్వహణ అధికారి రుద్రరాజు గంగాశ్రీదేవి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ప్రమాణం


పాలకోడేరులో విద్యుత్ ఉద్యోగులు ప్రమాణం చేస్తున్న దృశ్యం

పాలకోడేరు: నిబంధనలకు అనుగుణంగా పని చేస్తామని, భద్రతా ప్రమాణాలు పాటించి ప్రమాదాల బారి నుంచి జాగ్రత్తగా ఉంటామని మండలంలోని అన్ని గ్రామాల విద్యుత్ ఉద్యోగులు సోమవారం ప్రమాణం చేశారు. వినియోగదారులకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్నామని, అవసరమైనప్పుడు స్తంభాలు ఎక్కాల్సి వస్తే, సరైన లైన్ క్లియర్ చేసుకుంటానని, విద్యుత్ ప్రమాదాలు నివారించేందుకు స్పాట్ ఎర్త్ రాడ్ వేసుకుంటానని, స్తంభం ఎక్కి పనిచేస్తున్నప్పుడు ఫోన్ మాట్లాడనని, నా కుటుంబ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని పనిచేస్తామని వారు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ ఆర్‌వీ అప్పారావు, పలు గ్రామాలు లైన్ మేన్లు, సిబ్బంది పాల్గొన్నారు

డ్రగ్స్ నియంత్రణకు పాటుపడాలి


మాట్లాడుతున్న జడ్జి శ్రీసత్యాదేవి

సాక్షి, భీమవరం: డ్రగ్స్ నియంత్రణకు విద్యావంతులు, విద్యార్థులు పాటుపడాలని భీమవరం మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.శ్రీసత్యాదేవి పిలుపునిచ్చారు. స్థానిక బీవీ రాజు కళాశాలలో సోమవారం అంతర్జాతీయ మాదకద్రవ్య నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవహన సదస్సుకు శ్రీసత్యాదేవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మంచి సమాజం ఏర్పాటుకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం డీఎస్పీ బండారు శ్రీనాథ్, బార్ అసోసియేషన్ కార్యదర్శి పి.రమేష్ బాబు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎన్.సుధీర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఐఆర్ కృష్ణంరాజు, వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ఎస్‌వీ సత్యనారాయణ పాల్గొన్నారు.

28న డీఎన్నార్ మహిళా కళాశాలలో జాబ్ మేళా

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 28న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సోమవారం ప్రిన్సిపాల్ శోభారాణి చెప్పారు. ఉదయం 10 గంటలకు కళాశాల ఆవరణలో జీల్ కంపెనీ జాబ్ మేళా నిర్వహిస్తుందన్నారు. ఈ మేళాలో ఎంపికైన విద్యార్థులకు 20 రోజులు శిక్షణ ఉంటుందన్నారు. సంవత్సరానికి రూ. 1.80 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ వేతనం ఉంటుందన్నారు. డిగ్రీ పాసైన విద్యార్థులు, డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యేందుకు అర్హులన్నారు. ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యే విద్యార్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లను ఒరిజినల్, జిరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలన్నారు.

సంక్షేమ పాలనకు చిరునామా జగన్ ప్రభుత్వం

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- ఉండిలో గడపగడపకు మన ప్రభుత్వం


ఉండిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: ప్రజా సంక్షేమ పాలనకు చిరునామా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. గ్రామ సర్పంచ్ కమతం సౌజన్య, ఉప సర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్ వర్మ, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యులు రణస్తుల కనకదుర్గ ఆధ్వర్యంలో ఉండి 3వ సచివాలయ పరిధిలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రజలకు అందిన లబ్ధి, సంక్షేమ పథకాలపై వివరించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నేరుగా లబ్ధిదారుల ఖతాల్లో నగదు జమ చేస్తున్నారన్నారు. దీనికి తోడుగా ఇటీవలే ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత మేలు కలుగనుందన్నారు. అర్హత ఉన్న ప్రతి పేదవాడు సంక్షేమ పథకాలు అందకుండా ఉండకూడదనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి గత నాలుగేళ్లలో విస్తృతంగా సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఇంత గొప్ప లబ్ధి ప్రజలకు చేకూరుస్తుంటే ఎల్లో మీడియా మాత్రం తన అక్కసు వెళ్లగక్కుతోందన్నారు. చేసే ప్రతి మంచి కార్యక్రమంపై బురద చల్లుతోందన్నారు. వారి తప్పుడు ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని, లబ్ధిదారులంతా వారికి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో 175కి 175 స్థానాలు వైఎస్సార్‌సీపీకే కట్టబెట్టి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు పాలనలో ప్రజలెవ్వరూ లబ్ధిపొందలేదని అతనికి అనుకూలమైన వారు మాత్రమే లబ్ధిపొందారన్నారు. ప్రజలకు జరుగుతున్న మంచిని ఓర్చుకోలేని దుష్టచతుష్టయం అడుగడుగునా అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర డైరెక్టర్లు గులిపల్లి అచ్చారావు, కొప్రపాటి అనిత, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, రణస్తుల మహంకాళి, జిల్లా ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు గిరడ రమణ, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు కరిమెరక చంద్రరావు, గుండాబత్తుల సుబ్బారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కరిమెరక మల్లికార్జున, కమతం బెనర్జీ, బ్యాంక్ డైరెక్టర్ కరిమెరక శివనాగరాజు, బడుగు బాలాజీ, అంగర రాంబాబు, రాయి సతీష్, శేషాద్రి శ్రీను, గలావిల్లి ధనుంజయ, చెరుకువాడ సర్పంచ్ కొండవేటి శివయ్య, వాసుపల్లి విజయ్‌కుమార్, బొచ్చా అచ్చారావు, గుండు నాగేశ్వరావు పాల్గొన్నారు.

నేడు ఉండిలో గడపగడపకు మన ప్రభుత్వం

ఉండి: ఉండిలోని మూడో నంబర్ సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండో రోజు మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు సోమవారం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన తెలిపారు.

తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకంపై ఉచిత శిక్షణ

ఉండి: తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకంపై ఆసక్తి కలిగిన రైతులు, మహిళలు, యువత ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని కృషీ విజ్ఞాన కేంద్రాన్ని సంప్రదించాలని ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మల్లికార్జునరావు తెలిపారు. పూర్తిస్థాయిలో కేవీకే ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. తేనెటీగలు, పుట్టగొడుగుల ద్వారా ఎంతో ఆదాయం లభిస్తుందన్నారు. ఆసక్తి కలిగిన వారు నేరుగా గాని లేదా 99896 23823 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌గా విశిష్ట సేవలందించాలి


ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ


జెడ్పీ చైర్మన్‌కు పలుకుతున్న పాతపాటి శ్రీనివాసరాజు

సాక్షి, భీమవరం: జిల్లా అభివృద్ధితో పాటు ప్రజలకు విశిష్ట సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన పద్మశ్రీ సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెను అభినందించి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించినప్పుడే గుర్తింపుతోపాటు రాజకీయంగా ఉన్నత శిఖరాలకు అధిరోహించవచ్చన్నారు. జిల్లా ఎంపీపీ చాంబర్ అధ్యక్షుడు పేరిచర్ల విజయ నర్సింహరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రాజు, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, పోడూరు జెడ్పీటీసీ సభ్యులు గుంటూరి పెద్దిరాజు, ఘంటా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పాతపాటిని కలిసిన జెడ్పీ చైర్మన్

ఉండి: రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు (వాసు)ను ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ సోమవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పూలబొకేతో జెడ్పీ చైర్మన్ దంపతులను సత్కరించారు. భీమవరంలోని ఓ అధికారిక కార్యక్రమాన్ని ముగించుకున్న అనంతరం క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌తో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించి పలు విషయాలపై వారు చర్చించారు. అలాగే కాళ్ల మండలం జక్కరం గ్రామంలో చేపట్టాల్సిన పనుల మంజూరుపై జెడ్పీ చైర్మన్‌తో మాట్లాడగా వాటికి కావాల్సిన నిధులను మంజూరు చేసేందుకు ఆమె హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం క్షత్రియ కార్పొరేషన్ గత చైర్మన్ పాతపాటి సన్రాజు మృతిపై ఆమె విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డే ఏర్పాటుపై హర్షం

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రతి నెల మూడో శుక్రవారం ఉద్యోగుల సమస్యలపై గ్రీవెన్స్‌డే నిర్వహించాలని అన్ని స్థాయిల అధికారులకు వర్తించేలాగా ప్రభుత్వం జీవో జారీ చేయడంపై ఏపీ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డికి రాష్ట్ర సంఘం అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఎప్పుడు ఇటువంటి జీవో ఇవ్వకపోవడం వల్ల ఉద్యోగులకు సరైన సమయంలో వారి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఉద్యోగులు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక చాలా ఇబ్బందులు పడేవారన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెల మూడో శుక్రవారం గ్రీవెన్స్‌డేలో ఉద్యోగుల సమస్యలు చెప్పుకుని పరిష్కారించుకునే అవకాశం కల్పించడం హర్షణీయం అని పేర్కొన్నారు.

'ఆర్ఆర్‌డీఎస్'లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు జూలై 5వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి డిగ్రీ సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానం ప్రారంభమవుతుందన్నారు. బీకాం కంప్యూటర్ కాంప్లికేషన్, ఎకనామిక్స్, బీఏ ఎకానమిక్స్, హిస్టరీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్ కోర్సులు అందుబాటులో ఉంటాయన్నారు. వచ్చేనెల 5వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం తమ కళాశాలలో ఉచిత సౌకర్యం కల్పించామని, కళాశాలల ఎంపికకు జూలై 7వ తేదీ నుంచి 12వ తేది వరకు తమ కళాశాలలో ఉచితంగా నమోదు చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ ప్రసూన చెప్పారు. 16న సీట్లు కేటాయించి, 17 నుంచి తరగతులు నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాల కోసం 98664 50977 సెల్ నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

జగనన్న సురక్షపై అవగాహన


కుముదవల్లిలో మాట్లాడుతున్న సతీష్

పాలకోడేరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ఎలాంటి అవరోధాలు కలగకుండా, బాధ్యతగా కొనసాగించాలని పాలకోడేరు ఎంఎల్ఓ సతీష్, ఎంపీడీఓ నూకల మురళీ గంగాధరరావు పేర్కొన్నారు. సోమవారం గొల్లలకోడేరు, గరగపర్రు, కుముదవల్లి సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ పాలా రాధాకృష్ణ, సర్పంచ్‌లు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, లక్ష్మి, ఉప సర్పంచ్ కె.శ్రీనివాస్ వర్మ, ఎంపీటీసీ సభ్యులు షేక్ పాపా సాహెబ్ శంకరం, అంగరాజు సత్తిబాబు పాల్గొన్నారు.

స్పందనకు 9 ఫిర్యాదులు

ఆకివీడు: స్పందనలో తొమ్మిది ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీడీఓ కందుల వాణి సోమవారం చెప్పారు. సరిహద్దు భూముల ఆక్రమణలు, పింఛన్లు, కుప్పనపూడిలో స్పీడు బ్రేకర్లు తొలగించాలని, పట్టాదారు పాస్ పుస్తకం, కుల వృత్తి చెరువు పూడ్చవద్దని, తదితర అంశాలపై వినతులు వచ్చాయన్నారు. ఆయా వినతుల పరిష్కారానికి సంబంధిత అధికారులకు బదలాయించామని ఎంపీడీఓ తెలిపారు.

28న పోడూరు మండల పరిషత్ సమావేశం

పోడూరు: ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.సుహాసిని సోమవారం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు.

కోటి విష్ణు సహస్రనామ పారాయణం


వేణుగోపాలస్వామి ఆలయంలో పారాయణం చేస్తున్న మహిళలు


విశిష్ట అలంకరణలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

ఆకివీడు: ఆషాఢ మాసం ప్రారంభం నుంచి తొలి ఏకాదశి వరకు స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో కోటి విష్ణుసహస్ర నామ పారాయణం నిర్వహిస్తున్నారు. జూన్ 19న ప్రారంభమైన ఈ కార్యక్రమం జూలై 17వ తేదీ వరకు కొనసాగుతుంది. లోక కల్యాణార్థం గీతా మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం 50 మందికి పైగా మహిళలు పారాయణంలో పాల్గొంటున్నారు. పారాయణం అనంతరం ప్రసాద వితరణ జరుగుతుంది. ఈ నెల 29న స్వామివార్లకు లక్ష తులసి పూజలు చేయనున్నారు. 30న అఖండ అన్నసమారాధన జరుగుతుందని గీతా మహిళా మండలి అధ్యక్షురాలు కోసూరి రాజ్యలక్ష్మి చెప్పారు. ఆమె మాట్లాడుతూ మానవాళిని కాపాడాలని శ్రీమన్నారాయణుడ్ని ప్రార్థిస్తూ కోటి విష్ణు నామ పారాయణం చేస్తున్నామని చెప్పారు. ఆలయ అర్చకులు శేషాచార్యులు పాల్గొన్నారు.

కొత్త టెక్నాలజీ అధ్యయనంతో భవిష్యత్


భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో రాహుల్ దీక్షిత్‌ను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: నిత్యం అందుబాటులోకి వస్తున్న నూతన టెక్నాలజీని అధ్యయనం చేస్తేనే విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ దక్కుతాయని క్విస్ట్ గ్లోబల్ సంస్థ సీనియర్ ఆఫీసర్ రాహుల్ దీక్షిత్ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నూతన టెక్నాలజీస్ వేగంగా మారుతున్నాయని, దీనిని విద్యార్థులు పరిగణనలోకి తీసుకుని నూతన టెక్నాలజీ ఎక్కడ అందుబాటులో ఉంటుందో అక్కడ అవసరమైతే ప్రాజెక్టులు చేసి టెక్నాలజీని అధ్యయనం చేయాలన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కడైనా విద్యార్థి నైపుణ్యంతోనే ఉద్యోగాలు వస్తాయన్న అంశాన్ని గమనించాలన్నారు. తాను అధ్యయనం చేసే అంశాన్ని స్పష్టంగా చెప్పగలిగే స్థాయిలో విద్యార్థి కలిగి ఉండడంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా అభివృద్ధి చేసుకోవాలని రాహుల్ దీక్షిత్ సూచించారు. అనంతరం దీక్షిత్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణనిశాంత్‌వర్మ దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డీన్ కేఆర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాల కేంద్రాలతో లాభాలెన్నో

యలమంచిలి: జగనన్న పాల కేంద్రాలతో పాడి రైతులకు లాభం, గౌరవం లభిస్తుందని పశువైద్యుడు పోరెడ్డి చంద్రశేకరరెడ్డి చెప్పారు. మేడపాడులోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం ఆయన పాడి రైతులతో సమావేశమై జగనన్న పాలవెల్లువ కేంద్రాలకు పాలు పోయడం వల్ల కలిగే లాభాలను వివరించారు. జగనన్న పాల వెల్లువ కేంద్రాల్లో పాలు పోసే రైతులకు 11 వెన్న శాతం వస్తే లీటరు పాలకు రూ.88 వరకు అత్యధిక ధర ఇస్తారన్నారు. పాలు వేసే రైతులకు సబ్సిడీపై సంపూర్ణ మిశ్రమ దాణా, ఎక్కువ పాలు పోస్తే పశువుల కొనుగోలుకు రుణ సహాయం, ప్రతి పది రోజులకు బిల్లు, పశువుల ఆరోగ్య సమస్యలకు సత్వర వైద్యం, కేవలం రూ.384 చెల్లిస్తే మూడేళ్లపాటు పశువుకు రూ.30 వేలు బీమా పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో మేడపాడు సర్పంచ్ గంటా శాంతకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, ఉప సర్పంచ్ ముద్దల శ్రీనివాస్ వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం మళ్ల సోని, పాలవెల్లువ రూట్ ఇన్‌చార్జి ఆనందరాజు, వెటర్నరీ అసిస్టెంట్ బళ్ల దుర్గా భవాని పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ వినతి


భీమవరంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

సాక్షి, భీమవరం: పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు అఖిలపక్ష నాయకులు వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సీపీఐ, సీపీఎం, ఫార్వర్డ్‌బ్లాక్, ఎంసీపీఐ నాయకులు ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు జేఎన్వీ గోపాలన్, ఫార్వార్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి, ఎంసీపీఐ జిల్లా నాయకుడు కేవీవీ బ్రహ్మం మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెరగడంతో పేదలు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ ఛార్జీలతో పాటు ట్రూ అప్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, ఎం వైకుంఠరావు, ఎం సీతారాం ప్రసాద్, దండు శ్రీనివాసరాజు, ఎం లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన పెంచుకోవాలి

పెంటపాడు: ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి పెంచుకోవాలని మీనవిల్లూరు గ్రామ సర్పంచ్ చింతపల్లి లక్ష్మి పేర్కొన్నారు. పెంటపాడు యూనిట్ పరిధిలో మీనవిల్లూరు గ్రామంలో రైతులకు సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భీజామృతంతో విత్తనశుద్ధి చేసే విధానాన్ని రైతులకు తెలిపారు. పెంటపాడు మండల ఇన్‌చార్జి గుమ్మళ్ల వీర్రాజు, వీఏఏ ఉండ్రాజవరపు శ్యాం లు మాట్లాడుతూ పశువుల పేడ, సున్నం, పశువుల మూత్రంతో, నీటితో భీజామృతం తయారు విదానాన్ని తెలిపారు. సార్వా పంటకు ప్రధానంగా చీడపీడలు నివారించే శక్తి కేవలం భీజామృతానికే ఉందన్నారు. ప్రధానంగా విత్తనశుద్ధి చేసుకొంటే పంటను అధికశాతం చీడపీడలనుండి రక్షించుకోవచ్చన్నారు. మండల ఇన్‌చార్జ్ గుమ్మళ్ల వీర్రాజు, వీఏఏ ఉండ్రాజవరపు శ్యాంలు, పార్టీ బీసీ సంఘ నాయకులు చింతపల్లి శ్రీనివాస్, రైతులు జోగి గోపాలం, గుబ్బల సత్యనారాయణ, జోగి కొండల రావు, ర్యాలీ సత్యనారాయణ, ఉండవల్లి శివయ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

క్షీరారామలింగేశ్వరుడికి 'పైనాపిల్' అలంకరణ


పైనాపిల్ పండ్ల అలంకరణలో క్షీరారామలింగేశ్వరస్వామి


శాకంబరి అలంకరణలో దర్శనమిస్తున్న పార్వతి అమ్మవారు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం క్షీరారామలింగేశ్వర ఆలయంలో స్వామివారిని సోమవారం సుమారు 100 పైనాపిల్ పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు అనిల్ ఈ అలంకరణ ఏర్పాటు చేశారు. రాత్రి 7 గంటలకు స్వామివారికి పంచహారతుల కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శాకంబరిగా లక్ష్మీ,పార్వతి అమ్మవార్లు

పంచారామక్షేత్రం క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీ పార్వతి అమ్మవార్లను శాఖంబరిగా అలంకరించారు. ఆషాఢ మాసంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరణ చేస్తారు. ఈ సందర్భంలో సోమవారం పార్వతి దేవి, లక్ష్మీ దేవిని వివిధ రకాల పండ్లు, కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారికి అభిషేకాలు, జనార్దనస్వామికి అర్చనలు చేసిన అనంతరం అమ్మవార్ల అలంకరణను తిలకించి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు కిష్టప్ప అమ్మవార్లకు అలంకరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ పాల్గొన్నారు.